29-12-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ప్రశ్నలలో తికమకపడడం మాని మన్మనాభవగా ఉండండి, తండ్రిని మరియు వారసత్వాన్ని స్మృతి చేయండి, పవిత్రంగా అవ్వండి మరియు తయారుచేయండి"

ప్రశ్న:- పిల్లలైన మీ చేత శివబాబా తమ పూజను చేయించుకోలేరు, ఎందుకు?

జవాబు:- బాబా అంటారు - నేను పిల్లలైన మీకు అతి వినమ్రుడినైన సేవకుడిని. పిల్లలైన మీరు నాకు యజమానులు. నేను పిల్లలైన మీకు నమస్కారం చేస్తాను. తండ్రి నిరహంకారి. పిల్లలు కూడా తండ్రి సమానంగా అవ్వాలి. నేను పిల్లలైన మీ చేత నా పూజను ఎలా చేయించుకుంటాను. కాళ్ళు కడిగేందుకు అసలు నాకు కాళ్ళు కూడా లేవు. మీరు ఈశ్వరీయ సేవాధారులుగా అయి విశ్వసేవను చేయాలి.

పాట:- నిర్బలునితో శక్తివంతుని యుద్ధము... (నిర్బల్ సే లడాయి బలవాన్ కి...)

ఓం శాంతి. నిరాకార శివ భగవానువాచ - శివబాబా నిరాకారుడు మరియు ఆత్మలేవైతే శివబాబా అని అంటాయో అవి కూడా వాస్తవానికి నిరాకారియే. వారు నిరాకార ప్రపంచంలో నివసిస్తారు. ఇక్కడ పాత్రను అభినయించేందుకు సాకారులుగా అయ్యారు. ఇప్పుడు మనందరికీ అయితే పాదాలు ఉన్నాయి. శ్రీకృష్ణునికి కూడా పాదాలు ఉన్నాయి. పాదాలను పూజిస్తారు కదా. శివబాబా అంటారు - నేను వినమ్రుడిని, మీ చేత పాదాలు కడిగించుకునేందుకు లేక పూజ చేయించుకునేందుకు నాకు అసలు పాదాలే లేవు. సన్యాసులు పాదాలను కడిగించుకుంటారు కదా. గృహస్థులు వెళ్ళి వారి పాదాలను కడుగుతారు. పాదాలు అయితే మనుష్యులకు ఉంటాయి. మీరు పాదాలను పూజించేందుకు శివబాబాకు అసలు పాదాలే లేవు. ఇవి పూజ కొరకు సామాగ్రి. తండ్రి అంటారు - నేనైతే జ్ఞాన సాగరుడను, నేను నా పిల్లలతో పాదాలు ఎలా కడిగించుకోగలను? తండ్రి వందే మాతరం అని అంటారు. మాతలు తిరిగి ఏమనాలి? వారు లేచి నిలబడి - శివబాబా, నమస్తే అని చెప్పాలి. ఏ విధంగానైతే సలామ్ మాలేకుమ్ అని అంటారు కదా. అప్పుడు కూడా మొదట తండ్రియే నమస్కరించాల్సి ఉంటుంది. వారంటారు - నేను అతి వినమ్రుడిని, అనంతమైన సేవకుడిని. వారు నిరాకారుడు మరియు ఎంత నిరహంకారి. ఇక్కడ పూజ యొక్క విషయమేమీ లేదు. అతి ప్రియమైన పిల్లలు ఎవరైతే ఆస్తికి వారసులుగా అవుతారో వారిచేత పూజలు ఎలా చేయించుకుంటాను? అయితే, చిన్న పిల్లలు తండ్రి పాదాలకు నమస్కరిస్తారు ఎందుకంటే తండ్రి పెద్దవారు. కానీ వాస్తవానికి తండ్రి పిల్లలకు సేవకుడు కూడా. పిల్లలను మాయ ఎంత విసిగిస్తుందో వారికి తెలుసు. ఇది చాలా కఠినమైన పాత్ర. ఎంతో అపారమైన దుఃఖాలు ఇప్పుడింకా రానున్నాయి. ఇవన్నీ అనంతమైన విషయాలు, అందుకే అనంతమైన తండ్రి వస్తారు. తండ్రి అంటారు - దాతను నేనొక్కడినే, ఇతరులెవ్వరినీ దాత అని అనలేరు. అందరూ తండ్రి నుండే కోరుకుంటారు. సాధువులు కూడా ముక్తిని కోరుకుంటారు. భారత్ లోని గృహస్థులు భగవంతుడిని జీవన్ముక్తి కోరుకుంటారు. కావున దాత ఒక్కరే. సర్వుల సద్గతి దాత ఒక్కరే అన్న గాయనము కూడా ఉంది. సాధువులు తాము స్వయమే సాధన చేస్తున్నప్పుడు ఇక ఇతరులకు గతి-సద్గతులను ఎలా ఇవ్వగలరు? ముక్తిధామము మరియు జీవన్ముక్తిధామము, ఈ రెండింటికీ ప్రొప్రయిటర్ ఒక్క తండ్రియే. వారు తమ సమయానికి వస్తారు, ఒక్కసారే వస్తారు. మిగిలినవారంతా జనన-మరణాలలోకి వస్తూ ఉంటారు. వీరు మాత్రం - ఎప్పుడైతే రావణ రాజ్యం అంతమయ్యేది ఉంటుందో అప్పుడు ఒక్కసారి మాత్రమే వస్తారు. అంతకన్నా ముందు వారు రాలేరు. డ్రామాలో పాత్రయే లేదు. తండ్రి అంటారు - మీరు నా ద్వారా ఇప్పుడు నన్ను గుర్తించారు. ఇది మనుష్యులకు తెలియదు కావున వారు సర్వవ్యాపి అని అనేసారు.

ఇప్పుడు ఇది రావణ రాజ్యం. భారతవాసులే రావణుడిని కాలుస్తూ ఉంటారు. కావున రావణ రాజ్యమూ భారత్ లోనే ఉందని, అలాగే రామరాజ్యము కూడా భారత్ లోనే ఉందని నిరూపించబడుతుంది. ఇప్పుడు ఇది ఏ విధంగా రావణ రాజ్యము అని రామరాజ్యాన్ని స్థాపన చేసేవారే అర్థం చేయిస్తారు. ఈ విషయాలను ఎవరు అర్థం చేయిస్తారు? నిరాకార శివ భగవానువాచ. ఆత్మను శివుడు అని అనరు. ఆత్మలన్నీ సాలిగ్రామాలు. శివుడు అని ఒక్కరినే అంటారు. సాలిగ్రామాలైతే అనేకం ఉంటాయి. ఇది రుద్ర జ్ఞాన యజ్ఞము. ఆ బ్రాహ్మణులు ఏ యజ్ఞాలనైతే రచిస్తారో అందులో ఒక పెద్ద శివలింగాన్ని మరియు చిన్న-చిన్న సాలిగ్రామాలను తయారుచేసి పూజిస్తారు. దేవీలు మొదలైనవారి పూజలైతే ప్రతి సంవత్సరము జరుగుతాయి. ఇక్కడైతే రోజు మట్టితో తయారుచేస్తారు మరియు పూజ చేస్తారు. రుద్రుని పట్ల ఎంతో గౌరవముంటుంది. సాలిగ్రామాలు ఎవరు అనేది వారికి తెలియదు. శివశక్తి సైన్యమైన మీరు పతితులను పావనంగా

తయారుచేస్తారు. శివునికైతే పూజ జరుగుతుంది. సాలిగ్రామాలు ఎక్కడకు వెళ్ళాలి? అందుకే చాలామంది మనుష్యులు రుద్ర యజ్ఞాన్ని రచించి సాలిగ్రామాలకు పూజ చేస్తారు. శివబాబాతోపాటు పిల్లలు కూడా కష్టపడ్డారు, శివబాబాకు సహాయకులుగా ఉన్నారు. వారిని ఈశ్వరీయ సేవాధారులు అని అంటారు. స్వయం నిరాకారుడు కూడా తప్పకుండా ఏదో ఒక శరీరంలోకి వస్తారు కదా. స్వర్గంలోనైతే సేవ చేసే అవసరమే ఉండదు. శివబాబా అంటారు - చూడండి, వీరు నా సేవాధారీ పిల్లలు. నంబరువారుగా అయితే ఉన్నారు కదా. అందరి పూజ అయితే చేయలేరు. ఈ యజ్ఞాలు కూడా భారత్ లోనే జరుగుతాయి. ఈ రహస్యాన్ని తండ్రియే అర్థం చేయిస్తారు. ఆ బ్రాహ్మణులకు లేక షావుకారులకు ఈ విషయాలు తెలియవు. వాస్తవానికి ఇది రుద్ర జ్ఞాన యజ్ఞము. పిల్లలు పవిత్రంగా అయి భారత్ ను స్వర్గంగా తయారుచేస్తారు. ఇది పెద్ద హాస్పిటల్, ఇక్కడ యోగము ద్వారా మనము సదా ఆరోగ్యవంతులుగా అవుతాము. తండ్రి అంటారు - నన్ను స్మృతి చేయండి. దేహ-అహంకారము మొదటి నంబరు వికారము, అది యోగాన్ని తెంచేస్తుంది. దేహాభిమానులుగా అవుతారు, తండ్రిని మర్చిపోతారు, అప్పుడిక మిగిలిన వికారాలన్నీ వచ్చేస్తాయి. ఈ యోగాన్ని నిరంతరము జోడించడము చాలా కష్టము. మనుష్యులు శ్రీకృష్ణుడిని భగవంతునిగా భావించి అతనికి పూజ చేస్తారు. కానీ వారి పాదాలను పూజించేందుకు, వారు పతిత-పావనుడేమీ కాదు. శివునికైతే పాదాలే లేవు. వారు వచ్చి మాతలకు సేవకునిగా అవుతారు మరియు ఇలా అంటారు - తండ్రిని మరియు స్వర్గాన్ని స్మృతి చేసినట్లయితే మీరు 21 జన్మలు రాజ్యం చేస్తారు. 21 తరాలు మహిమ చేయబడ్డాయి. ఇతర ధర్మాలలో ఇవి మహిమ చేయబడవు. ఏ ధర్మం వారికీ 21 జన్మల స్వర్గ రాజ్యాధికారము లభించదు. ఇది కూడా డ్రామాలో నిశ్చితమై ఉంది. దేవతా ధర్మంవారు ఎవరైతే ఇతర ధర్మాలలో కలిసిపోయారో వారు మళ్ళీ తిరిగి వస్తారు. స్వర్గ సుఖాలైతే అపారమైనవి. కొత్త ప్రపంచము, కొత్త ఇంట్లో చాలా సుఖం ఉంటుంది. కాస్త పాతదిగా అవ్వడంతో ఏవో కొన్ని మరకలు అంటుకుంటాయి, కావున మళ్ళీ రిపేర్ చేయడం జరుగుతుంది. ఏ విధంగా తండ్రి మహిమ అపారమైనదో, అదే విధంగా స్వర్గం మహిమ కూడా అపారమైనది, దానికి యజమానులుగా అయ్యేందుకు మీరు పురుషార్థము చేస్తున్నారు. ఇంకెవ్వరూ స్వర్గాధిపతులుగా చేయలేరు.

వినాశన దృశ్యాలు చాలా బాధాకరమైనవని పిల్లలైన మీకు తెలుసు. అంతకన్నా ముందే తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకోవాలి. తండ్రి అంటారు - ఇప్పుడు నాకు చెందినవారిగా అవ్వండి అనగా ఈశ్వరీయ ఒడిని తీసుకోండి. శివబాబా గొప్పవారు కదా, అందుకే మీకు ప్రాప్తి ఎంతగానో ఉంది. స్వర్గ సుఖాలు అపారమైనవి. పేరు వినడంతోనే నోటిలో నీళ్ళు ఊరతాయి. ఫలానావారు స్వర్గస్థులయ్యారు అని అంటారు కూడా. స్వర్గం ప్రియమనిపిస్తుంది కదా. ఇది ఉన్నదే నరకము, ఎప్పటివరకైతే సత్యయుగం రాదో అప్పటివరకు స్వర్గంలోకి ఎవరూ వెళ్ళలేరు. తండ్రి అర్థం చేయిస్తారు - ఈ జగదాంబ వెళ్ళి స్వర్గ మహారాణి అయిన లక్ష్మిగా అవుతారు, అప్పుడు పిల్లలు కూడా నంబరువారుగా అవుతారు. మమ్మా-బాబా ఎక్కువ పురుషార్థం చేస్తారు. రాజ్యమైతే అక్కడ పిల్లలు కూడా చేస్తారు కదా, కేవలం లక్ష్మీ-నారాయణులే చేయరు. కావున తండ్రి వచ్చి మనుష్యుల నుండి దేవతలుగా తయారుచేస్తారు, చదివిస్తారు. ఒకవేళ అలా తయారుచేస్తే, మరి శ్రీకృష్ణుడిని ద్వాపరంలోకి తీసుకువెళ్ళిపోయారు. ద్వాపరంలో దేవతలు ఉండనే ఉండరు. మేము స్వర్గంలోకి వెళ్ళేందుకు మార్గాన్ని తెలియజేస్తాము అని సన్యాసులు చెప్పలేరు. దాని కోసమైతే భగవంతుడే కావాలి. ముక్తి-జీవన్ముక్తుల ద్వారాలు కలియుగ అంతిమములో తెరుచుకుంటాయి అని అంటారు. ఇది రుద్ర జ్ఞాన యజ్ఞము. నేను శివుడిని, రుద్రుడిని మరియు వీరు సాలిగ్రామాలు. వీరంతా శరీరధారులు. నేను శరీరాన్ని అద్దెకు తీసుకున్నాను. వీరంతా బ్రాహ్మణులు. బ్రాహ్మణులలో తప్ప ఈ జ్ఞానం ఇంకెవ్వరిలోనూ ఉండదు, ఇది శూద్రులలో కూడా ఉండదు. సత్యయుగంలో దేవీ-దేవతలు పారసబుద్ధి కలవారిగా ఉంటారు, ఆ విధంగా తండ్రియే ఇప్పుడు తయారుచేస్తారు. సన్యాసులు ఎవరినీ పారసబుద్ధికలవారిగా తయారుచేయలేరు. వారు స్వయం పవిత్రంగా ఉన్నప్పటికి, రోగగ్రస్థులుగా అవుతారు. స్వర్గంలో ఎప్పుడూ అలా రోగగ్రస్థులుగా అవ్వరు. అక్కడైతే అపారమైన సుఖముంటుంది, అందుకే తండ్రి అంటారు - ఇప్పుడు పూర్తిగా పురుషార్థం చేయండి. రేస్ జరుగుతుంది కదా. ఇది రుద్రమాలలో స్మరింపబడేందుకు రేస్. ఆత్మలమైన మనము యోగము యొక్క పరుగును తీయాలి. ఎంతగా యోగాన్ని జోడిస్తారో, అంతగా వీరు చురుకుగా పరుగెడుతున్నారు అని అర్థం చేసుకుంటారు. వారి వికర్మలు వినాశనమవుతూ ఉంటాయి. మీరు లేస్తూ-కూర్చుంటూ, నడుస్తూ-తిరుగుతూ యాత్రలో ఉన్నారు. ఇది బుద్ధియోగపు మంచి యాత్ర. మీరంటారు - ఇటువంటి స్వర్గం యొక్క అపారమైన సుఖాలను పొందేందుకు మేము పవిత్రంగా ఎందుకు ఉండము, మాయ మమ్మల్ని కదిలించలేదు. ప్రతిజ్ఞ చేయాల్సి ఉంటుంది. ఇది అంతిమ జన్మ, అందరూ మరణించాల్సిందే, మరి తండ్రి నుండి వారసత్వాన్ని ఎందుకు తీసుకోకూడదు. బాబా పిల్లలు ఎంతమంది ఉన్నారు . వారు ప్రజాపిత, కావున తప్పకుండా కొత్త రచనను రచిస్తారు. కొత్త రచన బ్రాహ్మణులది. బ్రాహ్మణులు ఆత్మిక సమాజ సేవకులు. దేవతలైతే ప్రారబ్ధాన్ని అనుభవిస్తారు. మీరు భారత్ కు సేవ చేస్తారు, అందుకే మీరే స్వర్గానికి

యజమానులుగా అవుతారు. భారత్ యొక్క సేవను చేయడంలో అందరి సేవ జరుగుతుంది. ఇది రుద్ర జ్ఞాన యజ్ఞము. రుద్రుడు అని శివుడిని అంటారు, అంతేకానీ శ్రీకృష్ణుడిని కాదు. శ్రీకృష్ణుడు సత్యయుగ రాకుమారుడు. అక్కడ ఈ యజ్ఞాలు మొదలైనవి ఉండవు. ఇప్పుడు ఇది రావణ రాజ్యం, ఇది అంతమవ్వనున్నది. ఆ తర్వాత ఇంకెప్పుడూ రావణుడిని తయారుచేయనే తయారుచేయరు. తండ్రియే వచ్చి ఈ సంకెళ్ళ నుండి విడిపిస్తారు. ఈ బ్రహ్మను కూడా సంకెళ్ళ నుండి విడిపించారు కదా. శాస్త్రాలను చదువుతూ-చదువుతూ ఎలాంటి పరిస్థితి ఏర్పడింది! కావున తండ్రి అంటారు - ఇప్పుడు నన్ను స్మృతి చేయండి. తండ్రిని స్మృతి చేసేందుకు ధైర్యము లేదు. పవిత్రంగా ఉండరు, వ్యర్థమైన ప్రశ్నలను అడుగుతూ ఉంటారు. తండ్రి అంటారు - మన్మనాభవ. ఒకవేళ ఏ విషయంలోనైనా తికమకపడితే దానిని వదిలేయండి, మన్మనాభవ అయి ఉండండి. అంతేకానీ ప్రశ్నలకు జవాబు లభించకపోతే ఇక చదువునే వదిలేయడం కాదు. వారు భగవంతుడు అన్నప్పుడు మరి రెస్పాన్స్ ఎందుకు ఇవ్వరు? అని అడుగుతారు. దానికి తండ్రి అంటారు, మీ పని తండ్రి మరియు వారసత్వముతో కదా. చక్రాన్ని కూడా స్మృతి చేయాల్సి ఉంటుంది. వారు కూడా త్రిమూర్తిని మరియు చక్రాన్ని చూపిస్తారు. ''సత్యమేవ జయతే'' అని వ్రాస్తారు, కానీ దాని అర్థాన్ని అర్థం చేసుకోరు. మీరు అర్థం చేయించవచ్చు - శివబాబాను స్మృతి చేసినట్లయితే సూక్ష్మవతనవాసులైన బ్రహ్మ-విష్ణు-శంకరులు కూడా గుర్తుకొస్తారు మరియు స్వదర్శన చక్రాన్ని స్మృతి చేసినట్లయితే విజయవంతులుగా అవుతారు. 'జయతే' అనగా మాయపై విజయాన్ని పొందడము. ఇది ఎంతగా అర్థం చేసుకోవలసిన విషయము. ఇక్కడ నియమమేమిటంటే - హంసల సభలో కొంగలు కూర్చోకూడదు. బి.కె.లు ఎవరైతే స్వర్గపు దేవతలుగా తయారుచేస్తారో వారిపై ఎంతో బాధ్యత ఉంది. మొదట ఎవరైనా వచ్చినప్పుడు వారిని ఎప్పుడూ ఇలా అడగండి - మీకు ఆత్మ యొక్క తండ్రి గురించి తెలుసా? ఎవరైతే ప్రశ్నలు అడుగుతారో, వారికి తప్పకుండా జవాబు తెలిసే ఉంటుంది. సన్యాసులు మొదలైనవారు ఎప్పుడూ ఈ విధంగా అడగరు. వారికి తెలియనే తెలియదు. మీకు అనంతమైన తండ్రి గురించి తెలుసా? అని మీరు ప్రశ్న అడుగుతారు. మొదటైతే నిశ్చితార్థం చేయండి. బ్రాహ్మణుల వ్యాపారమే ఇది. తండ్రి అంటారు - ఓ ఆత్మల్లారా, నాతో యోగాన్ని జోడించండి ఎందుకంటే ఇప్పుడు నా వద్దకు రావాలి. సత్యయుగీ దేవీ-దేవతలు చాలాకాలం నుండి వేరుగా ఉన్నారు కావున జ్ఞానం కూడా మొట్టమొదట వారికే లభిస్తుంది. లక్ష్మీ-నారాయణులు కూడా 84 జన్మలు పూర్తి చేసారు కావున మొట్టమొదట వారికే జ్ఞానం లభించాలి.

మనుష్య సృష్టి వృక్షానికి తండ్రి బ్రహ్మ మరియు ఆత్మలకు తండ్రి శివుడు, కావున వీరు బాప్ మరియు దాదా కదా. మీరు వారి మనుమలు. వారి ద్వారా మీకు జ్ఞానం లభిస్తుంది. తండ్రి అంటారు - నేను ఎప్పుడైతే నరకములోకి వస్తానో అప్పుడే స్వర్గాన్ని రచిస్తాను. శివ భగవానువాచ - లక్ష్మీ-నారాయణులు త్రికాలదర్శులు కారు. వారికి ఈ రచయిత-రచనల జ్ఞానమే లేదు, మరి ఇది పరంపరగా ఎలా కొనసాగగలదు? కొంతమంది ఏమనుకుంటారంటే, వీరైతే - మృత్యువు వచ్చేస్తుంది, వచ్చేస్తుంది అని కేవలం అంటూ ఉంటారు కానీ నిజానికి అలా ఏమీ జరగదు. దీనిపై ఒక కథ కూడా ఉంది కదా - అతను పులి వచ్చింది, పులి వచ్చింది అని అంటాడు కానీ అప్పుడు పులి రాలేదు, చివరకు ఒకరోజు పులి వచ్చేసింది, మేకలన్నింటినీ తినేసింది, ఈ విషయాలన్నీ ఇక్కడివే. ఒకరోజు మృత్యువు కబళించివేస్తుంది, అప్పుడు ఏం చేస్తారు? భగవంతుని ఈ యజ్ఞము ఎంత గొప్పది. పరమాత్మ తప్ప ఇంత పెద్ద యజ్ఞాన్ని ఇంకెవ్వరూ రచించలేరు. బ్రహ్మవంశీయులైన బ్రాహ్మణులుగా పిలువబడుతూ పవిత్రంగా అవ్వకపోతే మరణిస్తారు. శివబాబాతో ప్రతిజ్ఞ చేయవలసి ఉంటుంది. మధురమైన బాబా, స్వర్గాధిపతులుగా తయారుచేసే బాబా, నేనైతే మీ వాడిని, అంతిమం వరకూ మీ వాడిగానే ఉంటాను. ఇటువంటి తండ్రిని లేక ప్రియుడిని వదిలేస్తే మహారాజు-మహారాణులుగా అవ్వలేరు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. సత్యమైన ఈశ్వరీయ సేవాధారులుగా అయి భారత్ ను స్వర్గంగా తయారుచేయడంలో బాబాకు పవిత్రతా సహాయాన్ని చేయాలి, ఆత్మిక సమాజ సేవకులుగా అవ్వాలి.

2. ఏ విధమైన ప్రశ్నలలోనూ తికమకపడి చదువును వదిలేయకూడదు. ప్రశ్నలను వదిలి బాబాను మరియు వారసత్వాన్ని స్మృతి చేయాలి.

వరదానము:- హద్దుల నుండి అతీతంగా ఉంటూ అందరికీ తమవారు అన్న అనుభూతిని కలిగించే అనుభవీమూర్త భవ

ఏ విధంగా ప్రతి ఒక్కరి మనస్సు నుండి 'నా బాబా' అని వెలువడుతుందో, అలాగే అందరి మనస్సు నుండి - వీరు నా వారు, వీరు అనంతమైన సోదరుడు లేక సోదరి, దీదీ లేక దాదీ అని వెలువడాలి. మీరు ఎక్కడ ఉన్నా కానీ అనంతమైన సేవకు నిమిత్తులు. హద్దుల నుండి అతీతంగా ఉంటూ అనంతమైన భావనను, అనంతమైన శ్రేష్ఠ కామనను ఉంచడమే బాబాను ఫాలో చేయడము. ఇప్పుడు దీనిని ప్రాక్టికల్‌గా అనుభవం చేయండి మరియు చేయించండి. ఏ విధంగా అనుభవజ్ఞులైన వృద్ధులను తాతగారు, పెదనాన్నగారు అని అంటారో, అలా అనంతమైన అనుభవజ్ఞులు అనగా అందరికీ 'వీరు మా వారు' అని అనుభవమవ్వాలి.

స్లోగన్:- ఉపరామ స్థితి ద్వారా ఎగిరే కళలో ఎగురుతూ ఉన్నట్లయితే కర్మ రూపీ కొమ్మ అనే బంధనంలో చిక్కుకుపోరు.